క్లుప్తంగా

రామారెడ్డి సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు, సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ రామారెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొఫెసర్‌గా రామారెడ్డి విశ్వవిద్యాలయానికి ఎన్నో సేవలు అందించారన్నారు. విద్యార్థులకు అనేక రకాలుగా వెన్నుదన్నుగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు బండారి రాజిరెడ్డి మృతి చెందారు. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వాసవిమాతకు పూజలు



జఫర్‌గఢ్: వాసవిమాత సన్నిధానంలో మహిళలు ధన, ఫల పుష్పాలతో ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి మరిపెడ వాసవి పీఠం అధిపతి అనిల్ నేతృత్వంలో పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా 108 ఫలాలు, నాణెములతో మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు అనిల్, మహిళలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖంగా ఉండాలి


బొడ్రాయికి పూజలు చేస్తున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం రేగుల గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ ఉత్సవంలో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, నాయకులు సునీల్‌రెడ్డి, యాకయ్య, క్రాంతి, శివ, అనీల్‌రెడ్డి, శ్రీనివాస్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం


కేక్ కట్ చేస్తున్న నరేందర్‌గౌడ్

జనగామ: జగదేకవీరుడు అతిలోకసుందరి సినిమా విడుదలై 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఆలేటి నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ సినిమా రంగంలో సంచలం సృష్టించిన ఆ మూవీని 2డీ, 3డీలో రెండో సారి విడుదల చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు. నాడు ఆ సినిమా జనగామ స్వర్ణకళామందిర్ థియేటర్‌లో విడుదల కావడం చాలా సంతోషమన్నారు. ఈ వేడుకల్లో స్వర్ణ కళామందిర్ మేనేజర్ దొర్నాల వేణు, తిరుమలేష్, వెంకట నర్సు, గర్దాసు ఆంజనేయులు, మంద నాగరాజు, జానీ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలో ఐకేపీ కార్యాలయం

- శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లయినా నిర్మాణానికి నోచుకోని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, పాలకులు


అద్దె భవనంలో కొనసాగుతున్న ఐకేపీ కార్యాలయం


శిలాఫలకం

జఫర్‌గఢ్: మహిళా పొదుపు సంఘాలకు సంబంధించిన ఐకేపీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేపట్టి తొమ్మిదేళ్లవుతున్నా నిర్మాణ పనులు ఏ మాత్రం చేపట్టలేదు. భవన నిర్మాణ పనులు చేపట్టే విషయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే ఇబ్బందుల నడుమ కార్యాలయాన్ని కొనసాగిస్తున్న దుస్థితి మండలంలో నెలకొంది. మండలంలో మొత్తం 21 గ్రామాలకు 867 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 8,980 మంది మహిళలు సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. దీనికి సంబంధించిన మండల మహిళా సమాఖ్య (స్త్రీశక్తి భవనం) కార్యాలయానికి ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడంతో 15 సంవత్సరాల నుంచి అద్దె భవనంలోనే కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండటంతో కార్యాలయ నిర్వహణకు ఇబ్బందికరంగా మారింది. గదులు ఇరుకుగా ఉండటంతో ప్రతి నెల మహిళా పొదుపు సంఘాల సభ్యులతో సభలు, సమావేశాలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశాలు ఉండటంతో మహిళా సంఘాల సభ్యుల సభలు వాయిదా వేయాల్సి వస్తోంది. కాగా, మహిళా సంఘాల ఇబ్బందులను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం సొంత భవన నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా ఎంజీఎఫ్ఆర్ఈజీఎఫ్ గ్రాంట్ నుంచి రూ. 32 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరైన రెండేళ్లకు భవన నిర్మాణానికి ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో 2016 జూలై 10వ తేదీన అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టినా ఇప్పటి వరకు పనులు మాత్రం మొదలుపెట్టలేక పోయారు. కార్యాలయ నిర్మాణానికి అధికారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో శంకుస్థాపనకే పరిమితమైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు కోరుతున్నారు.

ఐకేపీ భవనం వెంటనే నిర్మించాలి



ఎన్నో ఏళ్ల నుంచి అద్దె భవనంలో ఐకేపీ కార్యాలయాన్ని కొనసాగిస్తుండడంతో ఇబ్బందికరంగా ఉంది. మహిళా సంఘాలకు సంబంధించిన సభలు, సమావేశాలు అద్దె భవనంలో నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాల్సి వస్తోంది. సొంత భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- జక్కు రాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే



ఏళ్లు గడుస్తున్నా అద్దె భవనంలోనే ఐకేపీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అద్దె భవనంలో గదులు సరిపోక మహిళా సంఘాల సభలు, సమావేశాలు నిర్వహించడం కష్టంగా మారింది. సొంత భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేపట్టి తొమ్మిదేళ్లవుతోంది. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్ట లేదు. భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

\- తాళ్లపల్లి రేణుక, మండల సమాఖ్య సెక్రెటరీ

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

- ఆర్డీఓ వెంకన్న


ఇప్పగూడెంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. భూభారతి చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలో మొదటగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం తాటికొండ, ఇప్పగూడెం గ్రామాల్లో సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆయా గ్రామాల్లో సదస్సుల నిర్వహణతీరును పరిశీలించారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీ వరకు సదస్సులు ఉంటాయని, భూ సమస్యలు ఉన్నవారు సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులను సమర్పించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, డివిజనల్ సర్వే ఇన్స్పెక్టర్ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న రాజేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా మజ్దూర్ యూనియన్ అహర్నిశలు పనిచేస్తుందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కాజీపేట ఇంజనీరింగ్ బ్రాంచి కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో రైల్వే కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైల్వే కార్మికుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన కోరారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రైల్వే కార్మికులు ఐక్య పోరాటాలను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కనుకరాజు, చిలుక శ్రీనివాస్, ఆవుల కుమార్, జి.కుమార్, తాటి కుమార్, వినోద్, సంపత్, లక్ష్మయ్య, కిరణ్, సన్నీ పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన


నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

బచ్చన్నపేట: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై ఆంధ్రప్రదేశ్ పోలీసుల సోదాలను జర్నలిస్టులు తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం ప్రధాన చౌరస్తాలో మండల పాత్రికేయులు నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఏపీ పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో పాత్రికేయులు జంగిలి భిక్షపతి, గంట తిరుమల్‌రెడ్డి, తాడిచెట్టు భాస్కర్, నీల పవన్‌కుమార్, ఎండీ.సలీం, అల్వాల రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందని ఇందిరమ్మ ఇళ్లు


వినతిపత్రం ఇస్తున్న గొల్లపల్లి వాసులు

దేవరుప్పుల: నిలువ నీడలేని నిరుపేదలకు కాకుండా ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ కమిటీ అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని గొల్లపల్లి వాసులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి తొమ్మిది మంజూరుకాగా ఒక్కొక్క కుటుంబంలో రెండు చొప్పున ఎంపిక చేసుకుని పేదలకు తీరని అన్యాయం చేశారన్నారు. గ్రామ సభలో పునఃవిచారణ జరిపి సామాజిక న్యాయం చేకూరుస్తూ అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దూదిమెట్ల సోమలింగం, జక్కిసురేష్, బట్ట సైదులు, కన్న రామచంద్రు, జవారపు వెంకన్న, బట్ట ఎల్లేష్ కర్ణం మల్లేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


శ్రీహరి సమక్షంలో చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కొమురయ్య

చిల్పూరు: రాజకీయాలకు అతీతంగా మల్లంకుంట్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం దేవాదాయధర్మాదాయశాఖ భువనగిరి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట ధర్మకర్తలుగా బుచ్చి కొమురయ్య, కొత్తపల్లి యాకరాజు, తాళ్లపల్లి శివకుమార్, భూక్య తిరుపతి, భీమగోని అనితలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక కోసం కొమురయ్యను తాళ్లపల్లి శివకుమార్ ప్రతిపాదించగా, కొత్తపల్లి యాకరాజు బలపర్చడంతో రామడుగు బుచ్చికొమురయ్యతో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్, ధర్మకర్తలను ఎమ్మెల్యే సన్మానించారు. గడ్డమీది సురేష్, మామిడాల లింగారెడ్డి, ఉమసమ్మయ్య, గజ్జెల దామోదర్ పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు


కంటైనర్లో ఉన్న గోవులు, గేదెలు

జనగామ: జిల్లా కేంద్రం మీదుగా ఓ కంటైనర్‌లో శుక్రవారం గోవులు, గేదెలను తరలిస్తుండగా గో సంరక్షకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గో చట్టం నిబంధనలను ఉల్లంఘించి పదుల సంఖ్యలో గోవులు, గేదెలను చెత్తబుట్టలో కుక్కేసిన విధంగా తీసుకు వెళ్తున్నారనే సమాచారం మేరకు వారు కంటైనర్‌ను పట్టుకున్నారు. గోవుల తరలింపుపై నిరంతరం గో సంరక్షకుల నిఘా పెరగడంతో ఎవరికి అనుమానం రాకుండా కంటైనర్‌లో తీసుకు వెళ్తున్నట్లు వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆలయాల్లో పూజలు


పాలకుర్తి టౌన్: సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఈఓ, సీఐ, ఆలయ అధికారులు


చిల్పూరు: బుగులు వేంకటేశ్వర ఆలయంలో మృత్యుంజయ హోమంలో పాల్గొన్న సిబ్బంది, భక్తులు


కొడవటూర్ సిద్దేశ్వరాలయంలో పూజ చేస్తున్న చైర్మన్ మల్లారెడ్డి తదితరులు

లింగాలఘణపురం/పాలకుర్తిటౌన్/చిల్పూరు/లింగాలఘణపురం: పాక్ ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం జిల్లాలోని పలు ఆలయాల్లో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖల ఆదేశానుసారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత సైన్యానికి భగవంతుని అనుగ్రహం ఉండాలని హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వేదపండితులు, ఆలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


లింగాలఘణపురం: జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో..

హామీలు నెరవేర్చాలి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాములునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 2గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఉద్యమకారుల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని పాటిమీది హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. స్థానిక గుడివాడ చౌరస్తా పంచగుళ్ల నుంచి రాజీవ్ చౌరస్తా మీదుగా పాటిమీది అంజనేయస్వామి దేవాలయం వరకు హనుమాన్ శోభాయత్ర చేపట్టారు. ఈ శోభ యాత్రలో హనుమాన్ భక్తుల భజనలు, నృత్యాలు అలరించాయి. అనంతరం అన్నప్రదాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ గురుస్వాములు సంగ కృష్ణమూర్తి, ఆకుల నాగరాజు, కోల నారాయణ, దాసరి మధు, చిలువేరు మల్లయ్య, లాకవత్ నరహరి, వీరమానేని వేంకటేశ్వర్‌రావు, మాదంశెట్టి భాస్కర్, వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున్న హనమాన్ భక్తులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపుపై అవగాహన


ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రఘునందన్‌రెడ్డి

తరిగొప్పుల: యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నెల్లుట్ల జానకి సూచించారు. మండలంలోని నల్లచెరువు సమీపంలో జరుగుతున్న ఉపాధిహామి పనుల వద్దకు వెళ్లి కూలీలకు సమ్మర్ క్యాంప్‌పై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న మౌలిక సదుపాయాలు, సమ్మర్ క్యాంప్‌పై అవగాహన కల్పించారు. 15 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని, శిక్షణలో శారీరక, మానసిక దృఢత్వం, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ సమయానిన వినియోగించుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం బానోతు రవీందర్, ఉపాధ్యాయులు విజయ, శ్రీనివాస్, లక్ష్మి, సీఆర్పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎండి పర్వేజ్, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, అలీ, పీడీ సాయికుమార్, సుధాకర్‌రెడ్డి, శ్రీలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చాకలి కులస్తులను ఎస్సీల్లో చేర్చాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకుర్తి టౌన్: చాకలి కులస్తులను బీసీ జాబితా నుంచి ఎస్సీల్లో మార్చేందుకు ఐక్యంగా పోరాడాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అన్నారు. ఈ నెల 28వ తేదీన హైదారాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే చాకలి ఎస్సీ సాధాన సమితి 8వ వార్షికోత్సవ మహాసభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆమె మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటప్పయ్య, జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, యాకయ్య పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

పాలకుర్తిటౌన్: ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని, దాని కోసం కేంద్రానికి సహకారం అందించాలని మండల వాసులు పేర్కొన్నారు. ఉగ్రదాడిలో జమ్ము కశ్మీర్‌లో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం రాత్రి గిరిజనులు, ఆర్యవైశ్యులు, స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్ర దాడికి భారత్ ధీటైన సమాధానం ఇస్తోందని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని డిమాండ్ చేశారు.

'వక్ఫ్‌బోర్డు చట్టసవరణకు వ్యతిరేకంగా పోరాడాలి'


మాట్లాడుతున్న ఉమర్ ఆబెదీన్

న్యూశాయంపేట: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బాధ్యుడు మహ్మద్ ఉమర్ ఆబెదీన్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా బాధ్యుడు మౌలానా ఫసియోద్దీన్ ఖాస్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వరంగల్ ఇస్లామియా కళాశాల మైదానంలో వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఈనెల 18న ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే బహిరంగ సభ ఏర్పాట్ల కోసం సన్నాహక సమావేశంలో ఉమర్ ఆబెదీన్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు ఐకమత్యంతో ముందుకు సాగి దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలని కోరారు. జలీల్‌ఖాన్, సత్తార్, మాజీద్, సుభాన్, మసూద్, ఖుద్దూస్ పాల్గొన్నారు.